

వైఎస్సార్‌సీపీలో చేరిక

చెన్నూరు అరుంధతీనగర్‌కు చెందిన జనసేన నాయకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో 20 కుటుంబాలవారు మంగళవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకొన్నారు. -8లో



యువకుడి హత్య

పాత కక్షలతోనే కమలాపురం పట్టణం పకీర్ వీధికి చెందిన మహ్మద్ బాషా(26)ను కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ తెలిపారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
44.5/27.6

వాతావరణం

జిల్లాలో మంగళవారం 27.6 - 44.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

మురిసిన మైదుకూరు

కదిలొచ్చిన జననేత కోసం... జనసంద్రం పోటెత్తింది. నిలువెత్తు సంక్షేమ సారథిని చూసి మురిసిపోయింది. అభివృద్ధి వారధి నీవేనంటూ నలుదిక్కులు పిక్కటిల్లేలా నినదించింది. నిప్పులు చెరిగే సూరీడు కూడా అభిమాన జల్లుల్లో తడిసి ముద్దయ్యాడు. రేపటి సంక్షేమ వెలుగులకు.. అభివృద్ధి ఉషోదయానికి సాక్ష్యమై నిలిచాడు. వైఎస్సార్‌సీపీ అధినేత..సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాకతో సీమకే కూడలిగా ఖ్యాతి గాంచిన మైదుకూరు హోరెత్తిపోయింది.

- జనసంద్రమైన మైదుకూరు
- ఆసక్తిగా సాగిన వైఎస్ జగన్ ప్రసంగం

మైదుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనతో మైదుకూరు మురిసిపోయింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి నిర్వహించిన బహిరంగ సభ జనహోరుతో దద్దరిల్లింది. ముఖ్యమంత్రి ప్రసంగానికి జనం జేజేలు పలికారు. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని మదీనా మసీదు నాలుగవ వీధి వద్ద సభా స్థలిని ఏర్పాటు చేయగా దానికి ఎదురుగా రాయల కూడలి, అటు నుంచి బద్వేలు రోడ్డు, నంద్యాల రోడ్డు, కడప రోడ్డు జనంతో కిక్కిరిశాయి. మధ్యాహ్నం రెండు గంటలకు ముఖ్యమంత్రి ప్రసంగం ప్రారంభమైంది. మిద్దెలపైకి వెళ్లేందుకు పోలీసులు నిరాకరించడంతో మండుటెండలోనే రహదారులపై నిలుచుని ముఖ్యమంత్రి ప్రసంగం వింటూ జనం తమ అభిమానాన్ని చాటుకున్నారు. వేలాదిగా వచ్చిన జనం ఇంచు కూడా కదలకుండా ఉండి సీఎం ప్రసంగం ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. దీంతో మైదుకూరులో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని సభకు వచ్చిన వారంతా ధీమా వ్యక్తం చేశారు.

నా తండ్రి లాంటి రఘురామిరెడ్డి..

ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వైఎస్సార్‌సీపీ మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టిపల్లె రఘురామిరెడ్డిని పరిచయం చేస్తూ.. 'మీ అందరికీ సుపరిచితుడు.. నా తండ్రి లాంటి వారు రఘురామిరెడ్డి గారిని గెలిపించండి' అని అభ్యర్థించారు. మరో వైపు నిలబడి ఉన్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని చూపిస్తూ నా తమ్ముడు, యువకుడు, ఉత్సాహవంతుడు, మంచి మనసున్న వ్యక్తి .. అతనిపై మీ చల్లని దీవెనలు కురిపించాలని, తప్పకుండా గెలిపించాలని కోరారు.

జనం కేరింతలు

మైదుకూరు సభాస్థలి వద్ద ప్రచార వాహనంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనిపించగానే ఒక్కసారిగా జనం ఉత్సాహంతో కేరింతలు వేశారు.

- ముఖ్యమంత్రి ప్రసంగం ప్రారంభంలోనే మైదుకూరు.. సిద్ధమా అనగానే సిద్ధమే అంటూ జనం కేకలు వేస్తూ బదులిచ్చారు.
- పిల్లల్ని బడికి పంపే తల్లులకు అమ్మ ఒడి ఇస్తూ బడి పిల్లలకు తాను మేనమామగా ఆర్థిక సాయం అందిస్తున్నాను అనగానే జనం కేరింతలు కొట్టారు.
- వైఎస్సార్‌సీపీకి 175కు 175 అసెంబ్లీ, 25కు 25 ఎంపీ సీట్లు రావాలి అందుకు సిద్ధమా అనగానే ప్రజలంతా సిద్ధమే అంటూ అరిచారు.
- మంచి చేసిన ఫ్యాన్ ఇంట్లో ఉండాలి.. చెడు చేసిన సైకిల్ ఇంటి బయట ఉండాలి.. తాగేసిన గ్లాస్ ఎక్కడ ఉండాలి అని సీఎం ప్రశ్నించగానే ప్రజలంతా సింకులో అంటూ అరిచారు.

'రాజోలి'కి అభయం

జిల్లాకు మేజర్ సాగునీటి ప్రాజెక్టు అయిన రాజోలి ఆనకట్టను వచ్చే దఫా కచ్చితంగా పూర్తి చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వచ్చాక రాజోలి ఆనకట్టకు శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్న సీఎం.. కోవిడ్ తదితర కారాణాల వల్ల వేగంగా రాజోలి పనులు పూర్తి చేయలేకపోయామని తెలిపారు. దేవుని దయవల్ల నాలుగేళ్ల పాటు వర్షాలు కురిశాయని ప్రాజెక్టులకు నీళ్లు సమృద్ధిగా అందాయని అన్నారు. ఈ ఏడాది వర్షాలు పడలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రాజోలి ప్రాధాన్యతను అందరూ గమనించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని పునరుద్ఘాటించారు. రైతు భరోసా, ఈ-క్రాప్, పంటల బీమా, పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్, సమయానికి సీజన్ మారకముందే ఇన్‌పుట్ సబ్సిడీ, గ్రామాల్లోనే రైతన్నల చేయి పట్టి నడిపించే ఆర్‌బీకే వ్యవస్థ రైతులకు అండగా గ్రామాల్లో కనిపిస్తున్నాయని వివరించారు.

రూ.2.70 లక్షల కోట్లు ఖాతాల్లోకి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని అక్క చెల్లెమ్మల ఖాతాల్లో ఎలాంటి వివక్షలేకుండా రూ.2.70 లక్షల కోట్లను నేరుగా అందించిందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. అక్క చెల్లెమ్మలకు రక్షణగా దిశ యాప్‌ను, వారికి రక్షణగా మహిళా పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దిశా యాప్‌ను చట్టం చేశామని తెలిపారు.



మైదుకూరులో జరిగిన సీఎం బహిరంగ సభకు హాజరైన జన సందోహంలో ఓ భాగం ... ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

సీఎం పర్యటన సాగిందిలా..

- సీఎం జగన్ మధ్యాహ్నం 1.55 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకున్నారు..
- 2.05 గంటలకు ముఖ్యమంత్రి ప్రసంగం ప్రారంభం
- 2.33 గంటలకు ప్రసంగం ముగింపు
- 2.42 గంటలకు సభాస్థలి నుంచి హెలిప్యాడ్‌కు బయలుదేరారు.
- 2.53 గంటలకు హెలిప్యాడ్‌కు చేరిక
- 3 గంటలకు హెలిప్యాడ్ వద్ద నుంచి తిరుగు ప్రయాణం

ప్రసంగం సాగింది ఇలా...

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన ప్రసంగంలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తూ రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణాల మాఫీ చేశారా అని అడుగుతున్నా రెండు చేతులు పైకెత్తి చెప్పండి ఇలా ఇలా ఇలా అనడంతో జనం అంతా ఒక్క సారిగా చేతులు పైకెత్తి లేదు లేదు అంటూ బదులిచ్చారు.
- ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ.25వేలు బ్యాంకులో వేస్తామన్నారు.. వేశారా రెండు చేతులు పైకెత్తి చెప్పండి ఇలా ఇలా ఇలా అనడంతో.. జనం లేదు లేదు లేదు అన్నారు.
- రూ.10వేలు కోట్లతో బీసీ సబ్ ప్లాన్ అన్నారు... చేయలేదు, చేనేతలకు పవర్ లూమ్స్ బకాయిలు మాఫీ అన్నారు.. చేయలేదు చంద్రబాబును నమ్మొచ్చా రెండు చేతులెత్తి చెప్పండి..ఇలా ఇలా ఇలా అనగానే జనం నమ్మం నమ్మం నమ్మం అంటూ కేకలు వేశారు.



మా నమ్మకం నువ్వే... యువకుడి ఉత్సాహం



అదుగో జగన్ మావయ్య... వైఎస్ జగన్‌ను చూసి చిన్నారుల కేరింతలు



సిద్ధమా... ప్రసంగిస్తున్న సీఎం జగన్ చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు




మధుర క్షణాలు...జననేతను తమ సెల్లో బంధిస్తున్న అభిమానులు

న్యూస్‌రీల్

కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: రోజురోజుకు అధిక ఉష్ణోగ్రతలతోపాటు ఎండ తీవ్ర పెరుగుతున్న తరుణంలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కార్మికశాఖ ఉప కార్మిక కమిషర్ బి.శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కార్మికుల రక్షణకు యాజమాన్యం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కర్మాగారాలు, దుకాణాలు, సంస్థల్లో పనిచేసేవారు, భవన నిర్మాణ కార్మికులు, వలస కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇదివరకే పలు సూచనలు చేశామన్నారు. కార్మికుల పని గంటల్లో మార్పు చేయాలన్నారు. వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫ్లూయిడ్స్, అత్యవసర మందులను సమకూర్చుకోవాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ కార్మికుల పనివేళలు మార్పు చేయాలని, డిహైడ్రేషన్ నివారణ మార్గాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

8 మంది డిబార్



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న వీసీ, సీఈ

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల సెమిస్టర్ పరీక్షలను వీసీ చింతా సుధాకర్ మంగళవారం బ్రహ్మంగారిమఠం, పుల్లారెడ్డిపేట డిగ్రీ కళాశాలలను పరీక్షల నియంత్రణాధికారి ఈశ్వరరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురు విద్యార్థులను డిబార్ చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు పరీక్షా కేంద్రాలను హైపవర్ కమిటీ సభ్యులు తనిఖీ చేసి మరో నలుగురు విద్యార్థులను డీబార్ చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తంగా మీద 8 మంది విద్యార్థులు డీబార్ అయ్యారని వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి తెలిపారు.

అవ్వా .. బాగున్నావా..!



-వివరాలు 10వ పేజీలో ▶

అవ్వా.. బాగున్నావా .. ఏం చెల్లీ కుశలమేనా.. ...అమ్మా.. ఎలా ఉన్నారు.. ఎన్నికల ప్రచారంలో వైఎస్ భారతి రెడ్డి ఓటర్లను పలకరిస్తున్న తీరిది. మంగళవారం వేంపల్లెలో ప్రచారం సాగించారు. ఆత్మీయ పలకరింపులు.. అభిమాన ఆప్యాయతల నడుమ ఆమె ప్రచారం సాగింది. 'మీ ఓటు ఫ్యాను గుర్తుకేయండ'ని అభ్యర్థించినప్పుడల్లా.. 'మంచి చేసిన రాజన్న బిడ్డకు కాకుండా ఇంకెవరికి ఓట్లు వేస్తా'మని ఓటర్లు జవాబిస్తుండడంతో ఆమె చిరునవ్వుతో ముందుకు సాగారు. - వేంపల్లె

నూతన నియామకాలు



వెంకటాచలపతికి నియామక పత్రం అందజేస్తున్న నారాయణస్వామి రాయల్

కడప రూరల్: బలిజ సంఘం నూతన అధ్యక్షుల నియామకాలు జరిగాయి. స్థానిక కాపునాడు రాష్ట్ర కార్యాలయంలో బలిజ గ్రేటర్ రాయలసీ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణ స్వామి రాయల్, రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షులుగా వెంకటాచలపతిని నియమించారు. జిల్లా అధ్యక్షుడిగా నరసింహులు నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

పండుటాకులకు పింఛన్ కష్టాలు వెంటాడుతున్నాయి. చంద్రబాబు చేసిన నిర్వాకం అవ్వాతాతలకు శాపంగా మారింది. ఇదివరకు ఒకటో తేదీ వచ్చిందంటే వేకువజామునే వలంటీర్‌లు తలుపు తట్టి ఆప్యాయంగా పలకరించి పింఛన్ నగదును అందజేసేవారు. చంద్రబాబు కారణంగా పింఛన్ల పంపిణీ విధానంలో మార్పులు వచ్చాయి. గత నెల సచివాలయల్లో పింఛన్ల పంపిణీ చేయగా.. ఈ సారి బ్యాంకుల్లో జమ కానున్నాయి. ఆ డబ్బులు తీసుకోవడానికి బ్యాంకులకు వెళ్లక తప్పని పరిస్థితి వచ్చింది.

- మొత్తం పింఛన్లు 2,67,492
- అందులో 1,87,103 పింఛన్లు బ్యాంకు ఖాతాలకు జమ
- 80,389 పింఛన్లు ఇంటి వద్దనే పంపిణీ
- అవ్వాతాతలకు తప్పని తిప్పలు


కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభం కానుంది. మొత్తం పింఛన్లు 2,67,492కు గాను అందులో 1,87,103 పింఛన్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. అనారోగ్యం తదితర కారణాలతో బాధపడే 80,389 మందికి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే పింఛన్ నగదును అందజేసేలా చర్యలు చేపట్టారు.

సచివాలయాలకు వెళ్లడానికే ఇబ్బందులు పడ్డారు..

చంద్రబాబు మిత్ర బృందం వలంటీర్ వ్యవస్థపై ఫిర్యాదులతో దాడి చేశారు. వారు పండుటాకులన్న జాలి కూడా చూపలేదు. దీంతో ఎన్నికల కమీషన్ విధుల నుంచి వలంటీర్‌లు దూరంగా ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. ఆ ప్రభావం సామాజిక పింఛన్ల పంపిణీపై పడింది. అంతకు ముందు వలంటీర్‌లు పొద్దు పొడవక ముందే అవ్వాతాతల ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించే వారు..పింఛన్ నగదును అందజేసే వారు. చంద్రబాబు కారణంగా వలంటీర్‌లు విధులకు దూరంగా ఉండాల్సి వచ్చింది. దీంతో ఏప్రిల్ 1వ తేదీన జరిగిన పింఛన్ల పంపిణీలో అధిక శాతం మందికి సచివాలయాల్లోనే పింఛన్ల సొమ్మును అందజేశారు. భగభగ మండే ఎండల్లో పండుటాకులు సచివాలయాలకు వెళ్లలేక చాలా మంది అనారోగ్యానికి గురయ్యారు. కొందరు మృత్యువాత పడ్డారు. తాజాగా చేపట్టే పింఛన్ల పంపిణీలో అత్యధిక శాతం మందికి పింఛన్ నగదును బ్యాంకు ఖాతాలో జమ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంటే ఎక్కడో మారు మూల పల్లెలో ఉండే వృద్ధులు ఇతర కేటగిరీకి చెందిన వారు తమ గ్రామం నుంచి దాదాపు 10 కిలో మీటర్ల పైగా దూరంలో ఉండే బ్యాంకు వద్దకు వెళ్లి పింఛన్ నగదును తీసుకోవడం అటే అది ఎంత వరకు సాధ్యం అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పైగా ఎంత మంది దగ్గర 'ఏటీఎం కార్డులు' పే ఫోన్ సౌకర్యం ఉంటుందనేది ప్రశ్నార్థకమే. కాగా వారు వ్యయ ప్రయాసాలకు ఓర్చి బ్యాంకులకు వెళ్లి పింఛన్ సొమ్మును తెచ్చుకోవాలంటే ఇబ్బందులు పడక తప్పదనే వాదన వినిపిస్తోంది.



పంపిణీకి అన్ని చర్యలు చేపట్టాం...



పింఛన్ల పంపిణీకి అన్ని చర్యలు చేపట్టాం. బ్యాంకుల ద్వారా కొంతమందికి, అనారోగ్యం తదితర కారణాలతో బాధపడే వారికి ఇంటి వద్దనే పింఛన్లను పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నాం.

– ఆనంద్‌నాయక్, ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

వ్యయ పరిశీలనపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా చేపట్టే వ్యయ పరిశీలనపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగం ఎన్నికల నిర్వహణ అధికారులకు సూచించారు. రాష్ట్రానికి ప్రత్యేక వ్యయ పరిశీలకులుగా నియమితులైన నీనా నిగం మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజుతో కలిసి ఎన్నికల వ్యయ పరిశీలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లాకు కేటాయించబడిన ఎన్నికల వ్యయ పరిశీలకులు కేఎస్ రమేష్ భారతి, సత్యేంద్ర సింగ్ మెహరా, రాజేష్ కుమార్ మీనా, జేసీ గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, ఏఎస్పీ సుధాకర్ హాజరయ్యారు. సమావేశానికి ముందుగా జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత కోసం జిల్లా యంత్రాంగం చేపడుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగంకు వివరించారు. జిల్లాలోని ఏడు నియోజక వర్గాలు, అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలతో కలిపి మొత్తం 2035 పోలింగ్ కేంద్రాలతోపాటు 22 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించామని వివరించారు.

ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అన్ని ఏర్పాట్లు చేసుకున్నామని, ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న , విడుదల చేసిన డబ్బు, మద్యం తదితర అంశాలపై ఆమెకు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఎన్నికలలో పోటీ చేయబోయే ప్రతి ఒక్క అభ్యర్థికి సమాన అవకాశాలు ఉండాలన్నారు. గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి తదితర బృందాల నిఘా ఏర్పాట్లు, పర్యవేక్షణ చర్యలు బాగున్నాయని, వీటిని ఇలాగే కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ జిల్లాలో జరిగే ఎన్నికలకు విశేషమైన ప్రాముఖ్యత ఉందన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా చేపట్టే వ్యయ పరిశీలనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాగా జిల్లాలో ఎన్నికల సన్నద్ధత బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్స్పెండించర్ కమిటీ సభ్యులు ఆనంద్ నాయక్, నాగరాజ రావు, వెంకటేశ్వర్లు, 16 విభాగాలకు చెందిన నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ పనితీరును పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగం

ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ పరిశీలన

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగం మంగళవారం పరిశీలించారు. కంట్రోల్ రూములోని అన్ని విభాగాల సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఆమె పరిశీలించారు. వారితో పాటు వ్యయ పరిశీలకులు రమేష్ భారతి కేఎస్ సత్యేంద్ర సింగ్ మెహరా, రాజేష్ కుమార్ మీనాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల కంట్రోల్ రూమ్ ఇంచార్జి, కడప నగర కమీషనర్ ప్రవీణ్ చంద్ ఎంసీసీ, ఎంసీఎంసి, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ సెల్, ఎక్స్పెండెచర్ మానిటరింగ్ సెల్, సీజర్స్, సువిధ, గ్రీవిన్స్- రిడ్రెసల్ సెల్ మొదలైన విభాగాల సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులను గురించి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా పరిశీలకులకు వివరించారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



చెన్నూరు : పులివెందుల బైపాస్ రోడ్డులోని జేసీబీ మెకానిక్ షెడ్ ప్రక్కన పొలంలో వేప చెట్టు కింద బిక్షాటన చేసే గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని మంగళవారం సాయంత్రం చెన్నూరు పోలీసులు గుర్తించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 70–75 సంవత్సరాల మధ్య ఉంటుందని, శరీరంపై ఎలాంటి గాయాలు లేవని తెలిపారు. శరీరంపై నశిమి రంగు లుంగీ ఎరుపు, తెలు రంగు టవల్ ధరించారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వడదెబ్బతో యువకుడు మృతి



శివ మల్లారెడ్డి(ఫైల్)

కొండాపురం : మండలంలోని బురుజుపల్లె గ్రామానికి చెందిన రాచమల్లు శి మల్లారెడ్డి(30) వడ దెబ్బతో మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. బురుజుపల్లె గ్రామానికి చెందిన రాచమల్లు శివమల్లారెడ్డి మంగళవారం ఉదయం తోటకు వెళ్లే దారిలో ఎండ తీవ్రతకు స్పృహ కోల్పోయాడు. తాడిపత్రి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

వృద్ధురాలు ...



రాములమ్మ

సింహాద్రిపురం : విపరీతమైన ఎండ వేడిమి వడదెబ్బతో మంగళవారం భూమిరెడ్డి రాములమ్మ మృతి చెందిన వైనం మంగళవారం చోటుచేసుకుంది. బంధువుల వివరాల మేరకు.. మండలంలోని నంద్యాలంపల్లె గ్రామానికి చెందిన భూమిరెడ్డి రాములమ్మ (78) తమ పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో మంచంపై అలాగే కూలిపోయి ప్రాణాలు వదిలినట్లు వారు తెలిపారు.

మరో వృద్ధుడు..

ఖాజీపేట : అధికవేడిమి కారణంగా వడదెబ్బ తగిలి ఊసలపల్లి అంకయ్య (65) మృతి చెందాడు. కొత్తపేట పంచాయితీ కొత్త నెల్లూరు హరిజనవాడకు చెందిన అంకయ్య మైదుకూరుకు వెళ్లాడు. సాయిబాబా ఆలయం సమీపంలో అందరితో కలిసి భోజనం చేశాడు. అనంతరం ఉన్నపాటుగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికుల సాయంతో చికిత్స నిమిత్తం చెన్నూరు ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. .

వైఎస్సార్‌సీపీలో 50 కుటుంబాల చేరిక

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డుకు చెందిన టీడీపీ నాయకురాలు పల్లా లక్ష్మీదేవి ఆధ్వర్యంలో దాదాపు 50 కుటుంబాలు మంగళవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు శివప్రసాదరెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సుపరిపాలనను చూసి టీడీపీ సీనియర్ నాయకురాలైన పల్లా లక్ష్మీదేవి వైఎస్సార్‌సీపీలో చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, పద్మశాలి కార్పొరేషన్ చైర్ పర్సన్ జింకా విజయలక్ష్మి, బండి విజయభాస్కర్‌రెడ్డి, పల్లా సురేష్, చింపిరి అనిల్ కుమార్, గంజికుంట ఆంజనేయులు, బండారు సూర్యనారాయణ, గురునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు....

చింతకొమ్మదిన్నె : మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారంతా టీడీపీని వీడి మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కడప ఎంపీ వైయస్.అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి సాధారణంగా ఆహ్వానించారు.



వైఎస్ఆర్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

అనంతరం పార్టీలో చేరిన వారు ఎంపీ, ఎమ్మెల్యేలకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి.నరేన్ రామాంజుల రెడ్డి, గూడా, ప్రభాకర్‌రెడ్డి, గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కళా యాదవ్, గజ్జల సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో కంది నారాయణరెడ్డి, బుసిరెడ్డి ఈశ్వర్ రెడ్డి, జి.నాగేంద్రా రెడ్డి, కరముల సురేంద్ర, ధనియాల సుధాకర్, బొమ్మేపల్లి మధుసూదన్ రెడ్డి, బుసిరెడ్డి జగన్నాథరెడ్డి, గణేష్, బుసిరెడ్డి మోహన్ రెడ్డి, పల్లా రాజేంద్ర ప్రసాద్, జి భాస్కర్ రెడ్డి, సి రాజశేఖర్ రెడ్డి, కే సుబ్బారెడ్డి, ప్రసాదు తదితరులు ఉన్నారు.

జనసేన పార్టీ వీడి..

చెన్నూరు : చెన్నూరు అరుంధతినగర్ కు చెందిన జనసేన నాయకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో 20 కుటుంబాలవారు మంగళవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకొన్నారు. వీరికి ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే పీ.రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలా మంది వైయస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన గోపవరం శ్రీనివాసులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని పార్టీలో చేరినట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ప్రదీప్ రెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీలోకి చేరిక

వేంపల్లె : వేంపల్లెలో పలువురు మైనార్టీ నాయకులు టీడీపీ, బీజేపీ నుంచి వైఎస్సార్సీపీలోకి చేరారు. స్థానిక పిరమిడ్ నగర్‌లో కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి సతీమణి సమతారెడ్డి స్థానిక వైఎస్సార్సీపీ నేతలు సతీష్‌కుమార్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి, బిషప్ జాన్ బెన్నీ, శ్రీనివాసులు ఆధ్వర్యంలో 20 కుటుంబాల వాసులు మంగళవారం వైఎస్సార్సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ స్థానిక నేతలు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



వైఎస్సార్సీపీలోకి చేరిన బీజేపీ నాయకులు

అప్పారాంపల్లెలో 25 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : మండలంలోని అప్పారాంపల్లెకు చెందిన సందాప్రసాద్‌రెడ్డితో సహా 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సందా ప్రసాద్‌రెడ్డి, వీర నారాయణరెడ్డి, కిట్టయ్య, సుబ్బరాయుడు, శివారెడ్డి, శంకరయ్య, రామ చంద్రారెడ్డి, అయ్యవారు రెడ్డి, జిల్లర్, తిరుపతిరెడ్డి, బొంబాయి, నారాయణరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, చంద్రోఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డితో సహా 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన సందా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన రవీంద్రనాథ్ రెడ్డి, అవినాష్‌రెడ్డి లను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

హర..హర.. మహాదేవ..

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో గంగారాజరాజేశ్వరి సమేత ముక్తి రామలింగేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. వేకువ జామున సైకత లింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి, చండీమాతకు, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి విశేష అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గంగా రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను అలంకరించి రథంపై కొలువుదీర్చారు. భక్తుల శివనామస్మరణ మధ్య పురవీధుల్లో రథం లాగారు. చక్క భజనలు, కోలాటం, నరసరావుపేట తీన్మార్ తప్పెట్లు, మంగళవాయిద్యాల మధ్య దారి వెంబడి స్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం చౌడేశ్వరీదేవి ఆలయం వద్ద ఉంచి సాయంత్రం రథం ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నాలుగు వేల మంది పైగా భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





వందలాది భక్తజనం మధ్య రథోత్సవం భక్తులు
(ఇన్‌సెట్) రథంపై స్వామి, అమ్మవారు

పాత కక్షలతోనే యువకుడి హత్య

కడప డీఎస్పీ ఎండీ షరీఫ్

కమలాపురం : పాత కక్షలతోనే కమలాపురం పట్టణం పకీర్ వీధికి చెందిన మహ్మద్ బాషా(26)ను కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారని కడప డీఎస్పీ ఎం డీ.షరీఫ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ విలేకరులకు వివరాలు వెల్లడించారు. పకీర్ వీధికి చెందిన మహ్మద్ బాషా, తన మిత్రుడు షోయబ్‌తో కలిసి తరచూ క్రికెట్ ఆడుతుండేవాడని, అదే చోటికి ఇందిరమ్మ కాలనీకి చెందిన ముబారక్, తదితరులు వచ్చి గొడవపడేవారని డీఎస్పీ తెలిపారు. మహ్మద్‌బాషా వారిని వారించేవారని, 20 రోజుల క్రితం షోయబ్, ముబారక్ మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో వారిని అడ్డుకుంటున్న మహ్మద్ బాషా బైక్ పగులగొట్టారన్నారు. సోమవారం రాత్రి పది గంటలకు మహ్మద్ బాషా, షోయబ్, జాఫర్ వారి వీధిలో కూర్చుని ఉండగా ముబారక్, నూర్, యూనస్ వచ్చి గొడవ పడ్డారని, వీధిలో పెద్దలు సముదాయించి పంపారన్నారు. అనంతరం అదే రోజు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ముబారక్, మరింత మంది మహ్మద్ బాషా ఇంటికి వచ్చి నీ కొడుకు ఎక్కడ అంటూ అతడి తల్లిదండ్రులను ప్రశ్నించారు. తన కుమారుడు లేడని లేడని చెప్పడంతో మహ్మద్‌బాషా తల్లిదండ్రులను కొట్టి గాయ పరిచారు. వారి కేకలు విని మిద్దెపై నిద్రిస్తున్న మహ్మద్ బాషా కిందికి వచ్చాడు. ముబారక్ బృందం అతడిపై దాడి చేసి కత్తులతో పొడిచారు. తీవ్ర గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం కమలాపురం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్ఐ హృషికేశ్వర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును తెలుసుకున్నారు. మృతుడి తండ్రి ఉస్మాన్ గనిబాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ వివరించారు.



హత్యకు గురైన మహ్మద్ బాషా



మాట్లాడుతున్న డీఎస్పీ ఎండీ షరీఫ్

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి గాయాలు

వేంపల్లి : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థి శివ మంగళవారం ఆందోళనలో తనంతట తాను గాయపరచుకున్నాడు. ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లోని తన హాస్టల్ గదిలో కిటికీ అద్దాలు పగులగొట్టడంతో చేతికి గాయాలయ్యా యి. తోటి విద్యార్థులు ఆర్కే వ్యాలీ అధికారులకు సమాచారం అందించగా, వారు చేరుకొని కడప రిమ్స్‌కు తరలించారు. అయితే ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు ధృవీకరించారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం విద్యార్థి శివగా గుర్తించారు. ఈ విషయంపై ట్రిబుల్ ఐటీ ఆర్కే వ్యాలీ డైరెక్టర్ ను అడగగా ఇంట్లో సమస్యలతో విద్యార్థి ఆందోళనకు గురై ఈ ఘాతుకానికి పాల్పడ్డారని చెప్పారు. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు డైరెక్టర్ తెలిపారు.



విద్యార్థిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

కణితి మాంసం స్వాధీనం.. ఒకరి అరెస్టు

మైదుకూరు : కణితి మాంసాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్టు మైదుకూరు అటవీ రేంజ్ అధికారి ప్రణీత్‌రావు మంగళవారం తెలిపారు. దువ్వూరు మండలం నీలాపురం బీట్ పరిధిలో పాయ ప్రదేశంలో మినుము పంట రక్షణ కోసం మండలంలోని పెద్ద సింగనపల్లెకు చెందిన కొర్రా రామచంద్రారెడ్డి విద్యుత్తు తీగ కంచెగా వేసినట్టు ఎఫ్ఆర్ఓ తెలిపారు. సోమవారం సాయంత్రం రిజర్వ్ ఫారెస్టులోని కణితి విద్యుత్ కంచెకు తగిలి మృతి చెందిందన్నారు. గస్తీలో ఉన్న వనిపెంట రేంజికి చెందిన ఎఫ్ఎస్ఓ పీపీ.సుబ్బరాయుడు, ఎఫ్‌బీఓ సుచరిత విచారించి కంచె వేసిన రామచంద్రారెడ్డిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతడి వద్ద కణితి మాంసం, చర్మాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితున్ని మంగళవారం మైదుకూరు కోర్టుకు హాజరుపరిచినట్టు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న కణితి మాంసం, నిందితుడితో ఫారెస్టు రేంజ్ అధికారి, సిబ్బంది

నేటి నుంచి గూడుమస్తాన్ వలి దర్గాలో ఉరుసు

జమ్మలమడుగు : పట్టణంలోని హజరత్ సయ్యద్‌షా గూడు మస్తాన్ వలి దర్గా ఉరుసుకు ఏర్పాట్లుచేసినట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు ముల్లా జానీ తెలిపారు. బుధవారం సాయంత్రం నిషాతో ఉరుసు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, మే 2న గంధోత్సవం, 3న ఉరుసు, 4న జియారత్ ఉంటాయని తెలిపారు. 3న చాంద్ ఆతీఫ్ అండ్ పార్టీ, కరిష్మా అండ్ పార్టీ వారితో గొప్ప ఖవాలి పోటీలు ఉంటాయని వివరించారు.

కిరణ్ షో అట్టర్ ఫ్లాప్!

- కురబలకోట, బి.కొత్తకోటల్లో మమ
- కడప–బెంగళూరు రైల్వేలైన్‌పై కిరణ్ నోట అసత్యం
- టీడీపీ అభ్యర్థి అసభ్య పదజాలంపై ఆగ్రహం
- మూడు పార్టీలు కలిసినా జనంలేక నిమిషాల్లోనే ప్రసంగం



జనం లేని కురబలకోట రోడ్ షో

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట, బి.కొత్తకోటల్లో మంగళవారం మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి రోడ్ షోలు అట్టర్‌ఫ్లాప్ అయ్యాయి. మొక్కుబడిగా షోలు మమ అనిపించగా బి.కొత్తకోటలో ముస్లింలతో నిర్వహించిన సమావేశం మొక్కుబడిగా జరిగింది. ముస్లింల నుంచి స్పందన లేకపోవడంతో హాజరైన కొద్దిమందితోనే సభ నిర్వహించి ముగించారు. కిరణ్ ఎన్నికల ప్రచార పర్యటనలో భాగంగా తొలుత కురబలకోట మండలంలోని అంగళ్లు భారత్ కళ్యాణమండపం నుంచి సర్కిల్ వరకు ర్యాలీ ఉంటుందని ప్రకటించారు. తర్వాత దీన్ని రద్దు చేసుకుని జంగావారిపల్లె క్రాస్ నుంచి కురబలకోట వరకు రోడ్ షో నిర్వహించగా జన స్పందన లేదు. జనం లేని షోలో ఎంత మాట్లాడినా ఫలితం లేదని భావించిన ఆయన ప్రసంగం మూడు నిమిషాలకే పరిమితం చేసి ముగించారు. అక్కడినుంచి పెద్దతిప్పసముద్రం మండలం చెన్నరాయునిపల్లె సమీపంలో జరిగిన సభలో పాల్గొని టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డితో కలిసి బి.కొత్తకోట బీరంగిరోడ్డులో నిర్వహించిన ముస్లింల సమావేశానికి వచ్చారు. సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల మధ్య సమావేశం ఉంటుందని ముందే ప్రకటించినా స్పందన లేకపోవడంతో ఐదు గంటలు దాటాక హాజరైన కొద్దిమందితో సమావేశం ముగించారు. అక్కడి నుంచి బీరంగి రోడ్డు నుంచి జ్యోతిచౌక్ వరకు రోడ్ షో నిర్వహించగా మాజీ సీఎం స్థాయికి తగ్గట్టు జనం లేరు. మొక్కుబడిగా వచ్చిన జనంతోనే షో పూర్తి చేశారు. జ్యోతిచౌక్‌లో మాట్లాడిన కిరణ్ తన ప్రసంగాన్ని 8 నిమిషాలకే పరిమితం చేశారు. ప్రసంగాలయ్యాక జ్యోతిచౌక్ నుంచి దిగువ బస్టాండ్ వరకు రోడ్ షో కోసం బయలుదేరారు. జనంలేని కారణంగా ఒక నిమిషంలోనే షో ఆపివేయించి జీపు నుంచి దిగి కారులో వెళ్లిపోయారు. మూడు కూటమి పార్టీలు కలిసి నిర్వహించిన ఈ రోడ్ షోలకు కనీస స్పందన లేకపోయింది. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గం దూరంగా ఉంది.

రైల్వేలైన్‌పై కిరణ్ అసత్యం

కడప–బెంగళూరు రైల్వే లైన్‌పై బి.కొత్తకోట ప్రసంగంలో కిరణ్ అసత్యాన్ని పలికారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి తొలిసారి సీఎం అయ్యాక కేంద్రం, రాష్ట్రం కలిపి 50:50 భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. పనులకు అవసరమైన ప్రభుత్వ డీకేటీ భూములను ఉచితంగా ఇస్తామని వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అప్పట్లో కేంద్రానికి లేఖ కూడా రాసింది. తర్వాత అప్పటి రాజంపేట ఎంపీ సాయిప్రతాప్‌తో కలిసి రైల్వేలైన్ పనులకు కడపలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంలోనే సాయిప్రతాప్ ఈ రైల్వేలైన్ కోసం పట్టువదలక సాధించారని, ఇది ఆయన కృషి అని కూడా కొనియాడారు. అయితే కిరణ్ కుమార్‌రెడ్డి తాను సీఎంగా ఉన్నప్పుడు కష్టపడి కడప–బెంగళూరు రైల్వేలైను సాధించానని పచ్చి అబద్ధం చెప్పారు. అంతేకాదు రూ.190 కోట్లు కేంద్రానికి చెల్లించినట్టు కూడా చెప్పుకున్నారు. అప్పుడాయన ప్రభుత్వ చీఫ్‌విప్‌గా ఉన్నారు. సీఎంగా లేరు. అయినప్పటికీ ఈ రైల్వేలైన్‌ను తాను తీసుకొచ్చినట్టు చెప్పుకున్నారు.

టీడీపీ అభ్యర్థి నోట అసభ్యపదం

బి.కొత్తకోట రోడ్ షో సందర్భంగా టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి ప్రసంగిస్తూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిపై ఆరోపణలు చేస్తూ ఓ అసభ్య పదాన్ని వాడారు. అదే పదాన్ని రెండోసారి కూడా పలకడంతో హాజరైన జనం అవాక్కయ్యారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న వ్యక్తి నోట ఇలాంటి మాటలు రావడం సంస్కారం కాదని స్థానికులు చర్చించుకొంటున్నారు.

మహిళ మృతి

ముద్దనూరు : మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన అంజలి(32) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు.. వెంకట మహేష్ అనే వ్యక్తితో సుమారు 13 సంవత్సరాల క్రితం అంజలికి వివాహమైంది. వీరికి ఇరువురు సంతానం. గత మూడు నెలల నుంచి అంజలి అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నెల 28న ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. కర్నూలు ఆస్పత్రికి తరలించగా కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ 29న అర్ధరాత్రి మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రచార రథాల ధ్వంసం కేసులో ఏడుగురు అరెస్టు

పీలేరు రూరల్ : పీలేరు మండల పరిధిలోని వేపులబైలు వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ప్రచార రథాల ధ్వంసం కేసులో ఏడుగురిని అరెస్టు చేసినట్లు రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి ఫిర్యాదు మేరకు ధ్వంసం ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. అనుమానితులైన సురేష్‌కుమార్‌రెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, దీపు, కరీం, మధు, సాయి, వెంకట్రమణలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.

వాహన ధ్వంసం కేసులో..

మదనపల్లె : పట్టణంలో స్కార్పియో వాహనాన్ని ధ్వంసం చేసిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు విలేకరులతో ఆయన మాట్లాడుతూ కడప జిల్లా చక్రాయపేట మండలానికి చెందిన పూల నాగేంద్ర సోమవారం అంబేద్కర్ సర్కిల్ సమీపంలోని అంబాసిడర్ హోటల్ వద్ద పార్కింగ్ చేశారు. బొమ్మనచెరువు వేంపల్లెకు చెందిన తెట్టు రవి(49) ఉద్దేశపూర్వకంగా స్కార్పియో వాహనం అద్దాలు పగలగొట్టడమే కాకుండా, అడ్డు వచ్చిన పూల నాగేంద్రను కొట్టి భయభ్రాంతులకు గురిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తెట్టురవిని అరెస్ట్ చేశారు.